

27న గోదావరి హారతికి పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-కొవ్వూరు

కొవ్వూరులో ఈ నెల 27న గోదావరి హారతి కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్‌డిఒ రాణి సుస్మిత వెల్లడించారు. గురువారం ఆర్‌డిఒ కార్యాలయంలో దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గోదావరి హారతి పోస్టర్‌ను ఆర్‌డిఒ ఆవిష్కరించారు. గోదావరి హారతి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పని చేస్తున్నాన్నారు. వీక్షకుల సౌకర్యార్థం సిట్టింగ్ ఏర్పాట్లు పెంచుతున్నామని తెలిపారు. మూడు పంట్లు ఏర్పాటు చేసి వేదికను విశాలంగా మార్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సురపునేని చిన్న, పిల్లలమర్రి మురళీకష్ణ, దాస సాహిత్య ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు ఎన్.వి. శివరామకష్ణ, కలగర శ్రీనివాసు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్ష పదవిపై ఉత్కంఠ


- ఐదు నెలలుగా పదవి ఖాళీ
- వెంకటరమణ చౌదరిపైనే మొగ్గు
- తెరపైకి పలువురి పేర్లు

ప్రజాశక్తి-కొవ్వూరు

టిడిపి జిల్లా అధ్యక్షుని ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సామాజిక వర్గాల ప్రాధాన్యంపై అధిష్టానం దృష్టి సారించింది. పునర్విభజన నేపథ్యంలో జిల్లా భౌగోళిక స్వరూపం మారింది. రాజకీయ సమీకరణలు తారుమారయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా టిడిపి అధ్యక్ష పదవి ఏ సామాజికవర్గానికి కేటాయిస్తే ఏ విధమైన ప్రయోజనం ఉంటుందనే అంశంపై టిడిపి అధిష్టానం లెక్కలు వేస్తోంది. ఇన్నాళ్లూ ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన మాజీ మంత్రి కెఎస్.జవహర్ జిల్లా అధ్యక్షునిగా కొనసాగారు. ప్రస్తుతం ఆయనను రాజ్యాంగబద్ధమైన ఎస్‌సి కమిషన్ చైర్మన్‌గా నియమించడంతో జిల్లా అధ్యక్ష పదవికి ఖాళీ ఏర్పడింది. ఐదు నెలలుగా ఖాళీగా ఉన్న జిల్లా అధ్యక్షుని నియామకంలో టిడిపి అధిష్టానం మీనమేషాలు లెక్కిస్తోంది. రెండు నెలల క్రితమే జిల్లా నేతల నుంచి త్రిసభ్య కమిటీ అభిప్రాయాలు సేకరించింది. మెజారిటీ నేతలు కూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. ఇంతవరకు అధిష్టానం తన నిర్ణయాన్ని వెల్లడించలేదు. రెండు నెలలుగా ప్రతిష్టంబన కొనసాగుతోంది. రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ నేత గన్ని కృష్ణ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముల్లపూడి బాపిరాజు సైతం ఈ పదవి కోసం పోటీ పడుతున్నారు. ముగ్గురు నేతలు ఒకే సామాజికవర్గానికి చెందినవారు. తెలుగు యువత అధ్యక్ష పదవి కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన కాకర్ల సత్యేంద్ర ప్రసాద్‌కు దాదాపు ఖరారైనట్లు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ చైర్మన్‌తో పాటు రుడా చైర్మన్ పదవుల్లో అదే సామాజికవర్గానికి చెందిన వారే ఉన్నారు. దీంతో ఇతర సామాజికవర్గాలకు చెందిన నేతలకు ఈ పదవి కట్టబెడితే ఎలా ఉంటుందన్న అంశంపై అధిష్టానం దృష్టి సారించిందని చెబుతున్నారు.

తెరపైకి యర్ర వేణుగోపాల్ రాయుడు....?

రాజమహేంద్రవరానికి చెందిన కాపు సామాజికవర్గం నేత యర్ర వేణుగోపాల్ రాయుడు పేరు తెరపైకి వచ్చిందని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న ఆయన పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో గతంలో టిడిపి అధ్యక్ష పదవిలో కాపు సామాజికవర్గానికి చెందిన నేతలే సుదీర్ఘకాలం ఉన్నారు. ఈ రెండు జిల్లాల్లో కాపుల ప్రాబల్యం అధికంగా ఉండడంతో పూర్వం నుంచి ఆ సామాజిక వర్గానికే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అంబేద్కర్ కోనసీమ జిల్లాను బిసిలకు, కాకినాడ జిల్లాలో కాపు సామాజికవర్గానికి చెందిన జ్యోతుల నవీన్‌కు అధ్యక్ష పదవులు ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఏలూరు జిల్లాకు కమ్మ సామాజిక వర్గానికి చెందిన గన్ని వీరాంజనేయులు



ప్రస్తుతం అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు క్షత్రియ సామాజికవర్గానికి చెందిన నేతను నియమించారు. ఏలూరు జిల్లాకు కాపు సామాజిక వర్గానికి చెందిన ఎంఎల్ఎ చంటిబాబును నియమించాలని యోచిస్తున్నారు. ఇక్కడ వీరాంజనేయులును మార్చి చంటి బాబుకు ఇస్తే తూర్పులో వెంకటరమణ చౌదరికి ఖరారయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ వీరాంజనేయులనే కొనసాగిస్తే తూర్పులో వేణుగోపాల్ రాయుడు పేరు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

బోలెడు ఆశలతో బొడ్డు

పొత్తులో భాగంగా రాజానగరం స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించారు. దీంతో ఇక్కడి నుంచి సీటు ఆశించిన బొడ్డు వెంకటరమణ చౌదరికి రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. వైసిపి తరపున రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానానికి పోటీ చేసిన వెంకటరమణ చౌదరి ఓటమి పాలయ్యారు. అనంతరం టిడిపిలో చేరిన ఆయనకు రాజానగరం అసెంబ్లీ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ సీటు దక్కకపోగా మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ వర్గం నుంచి ఆశించిన మేరకు సహకారం ఉండడం లేదు. వెంకటేష్ తన కుమారుడు అభిరామ్‌ను ఇక్కడ రాజకీయాల్లో తిప్పుతూ తన వర్గాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో వెంకటరమణ చౌదరి జిల్లా అధ్యక్ష పదవిపై ఆశ పెట్టుకున్నారు. లోకేష్ ఆశీస్సులు ఉండడంతో ఆయన పేరు దాదాపు ఖరారయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

గంపెడాశలతో గన్ని

రాజమహేంద్రవరం నగరంలో సుదీర్ఘకాలంగా రాజకీయ అనుభవం ఉన్న గన్ని కృష్ణ తనకు ఏదో ఒక నామినేటెడ్ పదవి వస్తుందని ఆశించారు. మూడు విడతల్లో భర్తీ చేసిన నామినేటెడ్ పదవుల్లో ఆయనకు అవకాశం ఇవ్వలేదు. నగర మేయర్ పదవి ఆశిస్తున్నప్పటికీ కార్పొరేషన్ ఎన్నికలు ఇప్పట్లో జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో జిల్లా అధ్యక్ష పదవిపై ఆయన గంపెడాశలు పెట్టుకున్నారు. అదే సామాజికవర్గం నుంచి మరో ఇద్దరు నేతలు పోటీకి రావడం ఈయన ఆశలపై నీళ్లు చల్లాయి.

ముల్లపూడికి దక్కేనా లక్కు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు ముళ్లపూడి బాపిరాజు జిల్లా టిడిపి అధ్యక్ష పదవి కోసం గట్టి ప్రయత్నమే చేస్తున్నారు. ప్రస్తుతం పదవి ఆశిస్తున్న ముగ్గురు నేతల్లో మంచి వాగ్దాటి ఉన్న నేతగా ఈయనకు గుర్తింపు ఉంది. లోకేష్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలతో ఆయన పావులు కదుపుతున్నారు. పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెం నుంచి పోటీ చేసే అవకాశం కోల్పోయారు. నామినేటెడ్ పదవుల కేటాయింపులోనూ అవకాశం కల్పించలేదు. ఇటు జిల్లా అధ్యక్ష పదవి అయినా ఇవ్వాలని ఆయన వర్గీయులు కోరుతున్నారు.

గోదావరి పుష్కరాల సన్నాహాలు వేగవంతం

ప్రజాశక్తి-కొవ్వూరు

రానున్న గోదావరి పుష్కరాలు దృష్ట్యా, ఘాట్ల అభివృద్ధి పనులు, సౌకర్యాలు, ఏర్పాట్లపై హేతుబద్ధ విధానంలో ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో కలిసి కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో వసతులు, సమస్యలను ఆమె పరిశీలించారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ పరిధిలోని పుష్కరఘాట్ల వద్ద సౌకర్యాలు, పరిశుభ్రత, రవాణా, భద్రత అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆయా శాఖలు ప్రతిపాదించిన పనులను అనుసరించి ప్రతి శాఖకు బాధ్యతలను స్పష్టంగా కేటాయించిన మేరకు పుష్కరాలు ప్రారంభం కంటే ముందు ఆయా శాఖలు పనుల పూర్తిచేయాలన్నారు. గోదావరి పుష్కరాలు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లపై ఉన్నత స్థాయిలో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల బందం సమీక్షా సమావేశం జరగనున్న నేపథ్యంలో, జిల్లా స్థాయిలో అన్ని విభాగాలు సమన్వయంతో ముందస్తు సన్నాహాలు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు.

పర్యాటక శాఖ ప్రాజెక్ట్ పై సమీక్ష

కొవ్వూరు వద్ద గోదావరి ఒడ్డున పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు నిర్మాణంలో ఉన్న పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టు పురోగతిని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. 26 కాటేజీలు, బార్, రెస్టారెంట్, స్విమ్మింగ్ పూల్, కాన్ఫరెన్స్ హాల్ వంటి సౌకర్యాలతో కూడిన ఈ ప్రాజెక్టులో 60 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు 2027 పుష్కరాలు ప్రారంభానికి ముందేగానే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత, నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, సూరపనేని చిన్ని, కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఎఇ జి.సందీప్, ఇరిగేషన్ ఇఇ జి.శ్రీనివాస్, డిఇ కె.త్రినాథ్, ఎఇ మణికంఠ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

గోదావరి పుష్కర పనులపై కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నగరపాలక సంస్థ తరపున విస్తత ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. పుష్కరాల ఏర్పాట్లు, ముందస్తు సన్నద్ధతపై దిశా నిర్ధేశం చేశారు. గోదావరి పుష్కరాలకు దాదాపు 21 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వత మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సూచించారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, తాగునీరు, శానిటేషన్, గ్రీనరీ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం అవసరమైన అభివద్ధి పనుల జాబితాను తయారు చేసుకోవాలన్నారు. లక్షల్లో యాత్రికులు తరలి వచ్చినా ఎక్కడా ఇబ్బంది లేకుండా రహదారుల నిర్మాణం, వాహనాల పార్కింగ్, తాగునీరు, స్నానాల ఘాట్లు, అవసరమైన అన్ని వసతులూ ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, ఎస్ఇ రీటా, ఎంహెచ్ఒ వినూత్న పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

నకిలీ మద్యం నియంత్రణకే సురక్ష యాప్

ప్రజాశక్తి-కొవ్వూరు

నకిలీ, కల్తీ మద్యాన్ని నిర్మూలించేందకు అబ్కారీ శాఖ, ఎపి ప్రభుత్వం సురక్షా ఎపి ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించిందని ఎక్సైజ్ సిఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఈ యాప్ ద్వారా ప్రజలు తాము కొనుగోలు చేసిన మద్యం సీసాపై ఉన్న క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఆ మద్యం ప్రభుత్వ అనుమతితో విక్రయించబడినదా లేదా అనే విషయాన్ని సులభంగా తెలుసుకోవచ్చన్నారు. నకిలీ లేదా చట్టవిరుద్ధమైన మద్యం అయితే, వెంటనే హెచ్చరిక సందేశం వస్తుందన్నారు. యాప్‌లోని సమాచారం జిల్లా కేంద్రంలోని అధికారులు, రాష్ట్ర స్థాయి అధికారుల డేటాబేస్‌కు పంపబడుతుందన్నారు.ఈ విధంగా ప్రజలు కల్తీ మద్యం కొనుగోలు చేయకుండా జాగ్రత్త పడవచ్చు అని ఆయన తెలిపారు.




ఆహార ఉత్సవ్‌లో పాల్గొన్న విసి ప్రసన్నశ్రీ

ముగిసిన ఆహార్ మహోత్సవ్

ప్రజాశక్తి-రాజానగరం

నన్నయ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మూడు రోజులు జరిగిన ఆహార్ మహోత్సవ్ 2025-కార్యక్రమం గురువారం విజయవంతంగా ముగిసింది. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 84 ఫుడ్ స్టాల్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనికి న్యాయ నిర్ణేతలుగా నన్నయ గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.హైమావతి, బి.ఉష్మశ్రీ, ఎస్‌కెవిటి. పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబి.శాంతరాజ్యం, ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, తెలుగు విభాగం కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ తలారి వాసు, జూనియర్ అసిస్టెంట్ జి.చెన్నయ్య నాయుడు హాజరై ఫుడ్ స్టాల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా విసి ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆహార్ మహోత్సవ్ 14న క్విజ్, డిబేట్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్ వంటి అకడమిక్ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అక్టోబర్ 16 ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆహార్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించామని, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు హాజరై ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసి దీనిలో భాగస్వామ్యం అయ్యారని తెలిపారు.

కార్టూ'నిజం'





నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ఇఎస్ఐ, పిఎఫ్ ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రైవేటు హాస్పిటల్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్‌కు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని ప్రైవేట్ హాస్పిటల్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు బివిఎన్.పూర్ణిమరాజు డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అర్జున్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు 8 గంటల పని విధానం, వారాంతపు సెలవులు లేకపోవడం దుర్మార్గమని, తక్షణమే ప్రభుత్వ లేబర్ డిపార్టుమెంట్ జోక్యం చేసుకోవాలని, వారికి ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ఒటిలకు అదనపు వేతనం ఇవ్వాలని పూర్ణిమ రాజు డిమాండ్ చేశారు. కార్యదర్శి శ్రీనివాస్, ప్రసాద్, శ్రీలక్ష్మి, బేబి, బి.లక్ష్మి, ఎస్.రమణమ్మ, చిన్న, సుందరయ్య, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వితే చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వితే చర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ ఎడి ఫణి భూషణ్ రెడ్డి హెచ్చరించారు. కోరుకొండ మండలం, రాఘవపురంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులూ లేవని తెలిపారు. తవ్వకాలు చేస్తున్న పొక్లెయిన్‌ను విఆర్ఒకు స్వాధీనం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా గనులు, భూగర్భ శాఖ కార్యాలయం సర్వేయర్ శ్రీనివాస్, విఆర్ఒలు ఎ.శ్రీనివాస్, కె.మరియమ్మ పాల్గొన్నారు.

మార్కెట్ డైరెక్టర్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పెరవలి

నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా గురువారం మండలానికి చెందిన నలుగురు బాధ్యతలు స్వీకరించారు. కారుమూరి శేషు, పోతాబత్తుల శ్రీనివాస్ సంగీత పార్వతి, దాసం సుబ్రమణ్యం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టిడిపి, జనసేన నాయకులు అతికాల శ్రీను, పిప్పర రవికుమార్, బొడ్డు రామాంజనేయులు, పొప్పొప్పు వెంకట నాగేశ్వరరావు, చినబాబు, అబ్బిశెట్టి సత్తిరాజు, సందీప్, శ్రీనివాస్ చక్రవర్తి, హనుమంత సుబ్రహ్మణ్యం అభినందనలు తెలిపారు

విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి-గోపాలపురం

గుండె పోటుకు గురై అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులను కాపాడేందుకు కార్డియో పల్మనరీ రిసిసిటేషన్ ఎంతో మేలు చేస్తుందని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.సుజని అన్నారు. గురువారం స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలకు అన్నదేవరపేట పిహెచ్‌సి వైద్య సిబ్బంది సిపిఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎస్ సుభాషిణి, సిహెచ్ఒ నవీన్ కుమార్, త్రిమూర్తులు, సువర్ణ పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో వైద్య సేవలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

స్థానిక జిజిహెచ్‌లో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, వైద్య పరికరాల స్థితి, సిబ్బంది భర్తీ, నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సదుపాయాలు, రోగుల కోసం సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. 'ప్రజల ఆరోగ్యమే పరమావధిగా వైద్య సేవలందించే క్రమంలో ప్రతి వైద్యుడు ప్రజల కోసం పని చేస్తున్నామనే భావనతో బాధ్యతగా విధులను నిర్వహించాలన్నారు. జిజిహెచ్‌లో క్యాన్సర్ అనుబంధ వైద్య సేవలు విభాగంలో అంకాలజీ విభాగం ద్వారా రోగులకు సమగ్ర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ విభాగంలో ప్రత్యేక స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స, కౌన్సెలింగ్ మరియు ఫాలోఅప్ సేవలు అందిస్తున్నారు. ప్రజలకు ఈ సేవల గురించి అవగాహన కల్పించడం, అవసరమైన వ్యక్తులు సత్వరమే ఈ సౌకర్యాన్ని పొందేలా చేయడం ముఖ్యమని కలెక్టర్ సూచించారు. రాజమహేంద్రవరం జిజిహెచ్‌లో మొత్తం 484 పోస్టులు మంజూరై, 326 పోస్టులు భర్తీ కాగా, 158 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఖాళీగా ఉన్న పారామెడికల్ సిబ్బంది, టెక్నీషియన్ పోస్టులను నవంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్య లక్ష్మీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్..భాస్కర్ రెడ్డి, వివిధ వైద్య విభాగాల హెచ్ఒడిలు, వైద్యులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పిడింగొయ్య పంచాయితీ జైహింద్ నగర్‌లో గురువారం వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు బొప్పన సుబ్బారావు, పడాల వీర్రాఘవరెడ్డి, సుందరపల్లి అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు అయినా ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. చంద్రబాబు హామీలు ఇచ్చుకుంటూ పోయారు తప్ప అమలు విషయంలో ఎటువంటి శ్రద్ధా వహించలేదన్నారు. ఇప్పటికీ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఆయనకు కనబడటం లేదన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసి, ఆయన అనుచరులకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నక్కా రాజబాబు, నియోజవర్గ పరిశీలకులు నక్కా నగేష్, మాజీ ఎంపిపి రేలంగి సత్యనారాయణ, దాసరి శివకుమార్, చీరా రాజు, జాజుల శ్రీను, సిరసపల్లి శంకర్రావు, వేముల ఏసుబాబు, ఎరికే దుర్గారావు, ఇబ్రహీంబాషా, కడలి రాంబాబు, బండి వెంకట్రావు, కణితి లక్ష్మీనారాయణ, మాదాబత్తుల రాజు, చిన్నం ఆనంద్, మద్దిల రమణ, పల్లెటి చిన్నా, చిచ్చర చంటి పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న మాజీ మంత్రి వేణు, పార్టీ నాయకులు నక్కా రాజబాబు

ఘనంగా పోషణ మాసోత్సవాలు

ప్రజాశక్తి-గోపాలపురం

ఆరోగ్యకరమైన జీవితానికి సమతుల్యమైన పౌష్టిక ఆహారం తీసుకోవాలని పలువురు సూచించారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి డి.మమ్మీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో ఎంఇఒ ఎ.మహేశ్వరరావు, సిహెచ్‌సి డాక్టర్ మెర్సీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, స్థూలకాయ నివారణ, చక్కెర, నూనె వినియోగం గురించి అవగాహన కల్పించారు. తీసుకునే ఆహారంపై అవగాహన లేకపోవడంతో పాటు అత్యధిక కొవ్వు పదార్థాలు, బయట దొరికే జంక్ ఫుడ్ తినడం ద్వారా ఊబకాయానికి గురవుతున్నట్లు తెలిపారు.

స్పందన కేంద్రానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పాలంగిలోని స్పందన మానసిక వికలాంగుల కేంద్రానికి పెరవలి మండలం తీపర్రుకు చెందిన కుందుల గణపతిరావు, వాణి దంపతులు గురువారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. అమెరికాలో నివాసం ఉంటున్న తమ కుమారుడు బ్రహ్మయ్య చౌదరి, కోడలు లక్ష్మీ మేఘన వివాహ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా, స్పందనలో మానసిక వికలాంగుల మధ్య కేక్ కట్ చేయించి, వారికి భోజనం, పండ్లు, కేకు పంపిణీ చేసినట్టు గణపతి తెలిపారు.



నగదు అందజేస్తున్న గణపతి కుటుంబ సభ్యులు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ-ప్రభావం అనే అంశంపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు. మోడల్ కాలనీలోని ఎల్ఐసి యూనియన్ ఆఫీస్‌లో నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్య వక్తగా ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి.రమణయ్య పాల్గొని మాట్లాడారు. మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేట్ చేయడం పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య విద్యను, ఉన్నత వైద్యాన్ని దూరం చేయడం అన్నారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం అభివృద్ధి చెందాలని, ఇవి అందించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదే అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ తక్షణమే ఆపాలని లేని పక్షంలో విద్యార్థులందరినీ కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.జ్యోతిర్మయి, డి.సాహితి, టి.సౌమ్య, కార్తిక్, హేమంత్, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీవల్లి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంవి.రమణయ్య

ఘనంగా మహబూబ్ సుభానీ గంధోత్సవం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం పాత బస్టాండ్ సమీపంలో ఉన్న మహబూబ్ సుభాని దర్గా వద్ద 46వ గంధోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గా నిర్వాహకులు బాబు, జహాన్, దంపతుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవం నిర్వహించారు. పాత బస్టాండ్ సమీపం నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న దర్గా వరకు బాణసంచాలతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా అందరూ పాల్గొని దర్గాలో ఉన్న మహబూబ్ సుభానిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

త్యాజంపూడి పంచాయతీలో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని సిపిఎం సీనియర్ సభ్యులు వారా కృష్ణారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సమస్యలపై సంతకాలు సేకరించి పంచాయతీ వెల్ఫేర్ అసిస్టెంట్ దుర్గారావుకు వినతిపత్రం అందించారు. కృష్ణారావు మాట్లాడుతూ పంచాయతీలో తగినంతమంది పారిశుధ్య కార్మికులు లేరన్నారు. రోజూ చెత్తను సేకరించకపోవడం వల్ల ఇళ్ల వద్దే చెత్త పేరుకు పోతోందని తెలిపారు. తగినంతమంది పారిశుధ్య సిబ్బందిని నియమించాలని, పని చేస్తున్న వారికి వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. ఎస్.భగత్, గట్టెం నాని, నడిగట్ల రామారావు, సిరిగినీడి రమేష్ పాల్గొన్నారు.

రెసిడెన్సియల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని భూపతిపాలెం రెసిడెన్సియల్ స్కూల్లో ప్రిన్సిపల్ పి.సోమ సత్య శేఖర్ ఆధ్వర్యాన విద్యార్థులందరికీ కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ విఘ్నేష్ బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి విద్యార్థినీ పరీక్షించి రోగగ్రస్తులకు మందులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రూప్ మీటింగ్‌లో డాక్టర్ విఘ్నేష్ విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిగత పరిశుభ్రత, అంటువ్యాధులపై జాగ్రత్తలు, దోమలు నివారణ, పౌష్టికాహారం ప్రాముఖ్యత వంటి అంశాలమీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ నర్స్ జి.గ్రేస్, వైద్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పిలు వినోలియా, దినేష్, ఎఎన్ఎం వరలక్ష్మి, ఎంపిహెచ్ఎలు ఎం.శ్రీనివాస్, జి.పవన్, జివి.రమణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిరుపేదలు, నిరాశ్రయుల ఆకలి తీర్చాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పేదలు, నిరాశ్రయుల ఆకలి తీర్చేందుకు అందరూ సహకరించాలని అన్నా మినిస్ట్రీస్ స్వచ్ఛంద సంస్థ అధినేత ఇసుకపట్ల ఇమ్మానుయేల్ కుమార్ కోరారు. స్థానిక పుష్కర్‌ఘాట్‌లో గురువారం స్వర్ణాంధ్ర ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత అన్నదాన పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్నార్తుల ఆకలి తీర్చేందుకు మొబైల్ ఫుడ్ సర్వీస్ ద్వారా ఆరేళ్లుగా చేస్తున్న కృషిని కుమార్ ప్రశంసించారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ఉపాధి ఉద్యోగావకాశాలు కోల్పోయిన వారి కోసం మొబైల్ ఫుడ్ సర్వీస్ ప్రారంభించినట్టు తెలిపారు. ఆరేళ్లుగా సుమారు 12 లక్షల మంది ఆకలి తీర్చే ప్రయత్నం చేశామని, తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరీసా సంస్థ నిర్వాహకులు డాక్టర్ డి.కిషోర్, స్వర్ణాంధ్ర మేనేజర్ ఎద్దు హరికృష్ణ, బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తాండవ రిజర్వాయర్‌లో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

తాండవ రిజర్వాయర్‌లో పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తాండవ రిజర్వాయర్‌లో ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారంతో సంఘటనా ప్రాంతానికి పోలీసులు చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మతుడు అల్లిపూడి గ్రామానికి చెందిన వడ్లమూరి పెద్దింట్ల అలియా శ్రీను(36) గుర్తించారు. బుధవారం ఉదయం స్నానం చేసి వస్తానని ఇంటి దగ్గర నుంచి వెళ్లిన అతను గురువారం రిజర్వాయర్‌లో మృతి చెంది తేలాడు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం సమీపంలో సూర్యారావుపేటలో భర్తతో వివాదం కారణంగా నాగరాజు శ్రీజ్యోతి (25) బుధవారం ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీజ్యోతి తల్లి దుబాయ్ ఉంటూ ఆమెకు డబ్బులు పంపుతోంది. వీటిని భర్త కృష్ణ తీసుకుని జులాయిగా ఖర్చు చేస్తున్నాడని భార్యాభర్తలు ఇద్దరూ గొడవ పడ్డారు. దీనిపై తీవ్ర మనస్తాపం చెంది శ్రీజ్యోతి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఏడాదిన్నర, ఎనిమిది నెలల కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోసం ఘటనలో యువకునికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

రాజంపేట గ్రామానికి చెందిన యువతిని ఒక యువకుడు పెళ్లి పేరుతో మోసం చేసిన సంఘటనలో కోర్టు నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించింది. పెళ్లి పేరుతో నమ్మించి, ఆమె నుంచి సుమారు రూ. 8 లక్షల నగదు, మూడు కాసుల బంగారాన్ని అపహరించినట్లుగా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం వెలగపెల్లికి చెందిన చిట్టి పైడిరాజు అలియాస్ గూగుల్, అలియాస్ యశ్వంత్ రాజ్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ డి.రాంకుమార్ తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో వృద్ధునికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

రాపాక గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధుడు, అదే గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన సంఘటనలో పోలీసులు నిందితుని అరెస్టు చేశారు. రాపాక గ్రామానికి చెందిన బావిశెట్టి మంగయ్య అదే గ్రామానికి చెందిన వృద్ధురాలిపై బుధవారం అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యా దు చేశారు. పోలీసులు మంగయ్యను అరెస్టు కోర్టులో హాజ రు పరిచారు. న్యాయమూర్తి నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

ఆస్తి కోసం తల్లిదండ్రులు, సోదరునిపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడిలో ఆస్తి వివాదాల కారణంగా కుటుంబ సభ్యుల మధ్య కలహాలు తలెత్తాయి. మాధవరపు సత్యనారాయణ కుమారుడైన రవికుమార్ తన అన్నలు మాధవరపు శ్రీనివాసరావు, మాధవరపు చంద్రగిరి, మాధవరపు శివనాగ సత్య సాయిపై సీతానగరం మండల పోలీసులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. తన అన్నదమ్ములు కలిసి తమ తల్లిదండ్రులు మాధవరపు సత్యనారాయణ, సత్యవతిని ఆస్తి కోసం చిత్రహింసలకు గురిచేస్తున్నారని తెలిపారు. అక్టోబర్ 14 రాత్రి 9 గంటలకు తల్లిని జుట్టు పట్టి కిందకు ఈడ్చి దవడపై కొట్టారని, అడ్డుకోవడానికి ప్రయత్నించిన తనపై ముగ్గురూ కలిసి కొట్టారని తెలిపారు. తమ ఇంట్లో తల్లి దండ్రులకు, తమకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశా రు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణంలో పలు హోటళ్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ ఛానెల్స్‌లో బిర్యానీలో మండ్రకప్ప అవశేషాలు అంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో అధికారులు ఈ దాడులు చేపట్టారు. ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి జె.రామయ్య, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. వంటశాల పరిశుభ్రత, ఆహార పదా ర్థాల నాణ్యత, లైసెన్స్ వివరాలు తదితర అంశాలను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు.



ఐడి కార్డులు, డైరీలు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకు ఐడి కార్డుల అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రఘుదేవపురం పిఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు నూతన ఐడి కార్డులు, డైరీలను పంపిణీ చేసినట్లు హెచ్ఎం ఎం.శ్యామలా దేవి గురువారం తెలిపారు. పిల్లల భద్రత కోసం చైల్డ్ ట్రాకింగ్ సదుపాయం గల అధునాతన ఐడి కార్డులను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు రోజువారీ హోమ్ వర్క్ వివరాలను తల్లిదండ్రులకు తెలియజేసే విధంగా ప్రత్యేకంగా రూపొందించిన డైరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ పిల్లి జ్యోతి, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం


సిఆర్‌సిలో సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ తదితరులు

ప్రజాశక్తి - రావులపాలెం

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు.గురువారం స్థానిక సిఆర్‌సిలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా సిఆర్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాలు వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు, రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంత కుమారి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, డిఎస్‌పి సుంకర మురళీమోహన్, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.నాగమణి, సిఆర్‌సి రూప శిల్పి డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సిఆర్‌సి సభ్యులను అభినందించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యం గా ఉంటుందన్నారు. మహిళలు సమతుల్యమైన పోషక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మన ఇంటి పరిసరాల్లో సేంద్రియ విధానంలో ఆకుకూరలు పండించి వినియోగించుకుంటే ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉండవని సూచించారు. కిషోర బాలికల ఆరోగ్యంపై దష్టి సారించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందచేసే పౌష్టికాహారం తీసుకోవడం మూలంగా గర్భిణులు, శిశువు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సేవాభావంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 4 వందల మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్‌సి అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లిమిల్లి వీరరాఘవరెడ్డి, సేవా విభాగం డైరెక్టర్ సత్తి సూర్యభాస్కరరెడ్డి, నందం వీరవెంకట సత్యనారాయణ, ఓల్డేజ్ హోమ్ అధ్యక్షుడు వేగేశ్న రామరాజు, సిడిపిఒ ఎ.గజలక్ష్మి, తహశీల్దార్ బిఎం ముక్తేశ్వరరావు, సూపర్ వైజర్లు, కూటమి నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణీలు పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0తో రవాణా రంగానికి ఊతం

జిఎస్‌టి 2.0 సంస్కరణలతో రవాణా మరియు లాజిస్టిక్స్ రంగాలకు ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద ఆటో, క్యాబ్, మాక్సి వ్యాన్ డ్రైవర్లు నిర్వహించిన భారీ ర్యాలీలో ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆర్‌డిఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4,320 కిలోమీటర్ల కొత్త రహదారులు నిర్మించామన్నారు. ఆటో డ్రైవర్ల సేవ పథకం కింద అర్హులందరికీ రూ.15వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. నూతనంగా అమలులోకి వచ్చిన జిఎస్‌టి 2.0తో వాహనాల కొనుగోలు, నిర్వహణ ఖర్చులు తగ్గాయని, డ్రైవర్లు మరియు వినియోగదారులు లబ్ధి పొందనున్నారని వివరించారు. బస్సులు, మినీ బస్సులు, సరుకు వాహనాలు 28 శాతం నుంచి 18శాతం కి ట్రాక్టర్లు 12 శాతం నుంచి 5 శాతంకి విడిభాగాలు, ఉపకరణాలు 28 శాతం నుంచి 18శాతం కిరవాణా సేవలు, వాహన అద్దెలు 12శాతం నుండి 5శాతంకు థర్డ్ పార్టీ బీమా 12 శాతం నుంచి 5శాతంకు తగ్గిన జిఎస్‌టి ఈ సం స్కరణలతో రవాణా రంగం బలోపేతమవుతుందన్నారు. ప్రతి డ్రైవర్ జిఎస్‌టి 2.0 గురించి అవగాహన పెంచుకోవాలని ఎంఎల్‌ఎ సూచించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, ఈదాల సత్యనా రాయణ మూర్తి, చిన్నం శ్రీనివాసరెడ్డి, కొప్పిశెట్టి ప్రసాద్, తోట స్వామి తదితరులు పాల్గొన్నారు..


పంచారామాల ప్యాకేజీ కరపత్రాలు విడుదల చేస్తున్న డిపో మేనేజర్

ఆర్‌టిసి పంచారామ క్షేత్రాల బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎపిఆర్‌టిసి రామచంద్రపురం డిపో శివ క్షేత్రాలైన పంచారామాల బస్సు ప్రత్యేక ప్యాకేజీ కరపత్రం గురువారం విడుదల చేశారు. డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ని కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. బస్సు సరి పడా జనం ఉంటే వారి గ్రామానికి వచ్చి శివ క్షేత్రాలను దర్శించి తిరిగి వారి గ్రామానికి తీసుకు వస్తారని అన్నారు. ఈనెల 26 నుంచి వచ్చే నెల 17 వరకు ఈ స్పెషల్ ప్యాకేజీ ఏర్పాటు చేశామని ఈ సందర్భ ంగా డిపో మేనేజర్ వివరించారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్, ట్రాఫిక్ ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


సఖినేటిపల్లి గ్రామపంచాయతీ వద్ద గ్రామసభ

పంచాయతీ విభజనకు వ్యతిరేకంగా గ్రామస్తుల ఓటు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

సఖినేటిపల్లి గ్రామ మేజర్ పంచాయతీ విభజనకు గ్రామస్తులు వ్యతిరేకంగా ఓటు వేశారు. సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిగ్రామ మేజర్ పంచాయతీనీ రెండుగా విభజించాలనే అజెండాతో సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. సోమవారం గ్రామసభ అంటూ, గ్రామ ప్రజలంతా పాల్గొనాలని మైక్ ప్రచారం చేయగా ఆ రోజు భారీ వర్షం కారణంగా గ్రామ సభను పంచాయతీ కార్యదర్శి తాడి యేసు గురువారానికి వాయిదా వేశారు. గ్రామసభతో సఖినేటిపల్లి మేజర్ పంచాయితీనీ రెండుగా విభజన చేస్తారనే ప్రచారం గ్రామం అంతా చర్చంశానీయంగా మారడంతో మెజారిటీ ప్రజలు విభజనను వ్యతిరేకిస్తూ గ్రామసభకు హాజరై తమ ఓటును విభజనకు వ్యతిరేకంగా వేశారు. ఓటింగ్లో పాల్గొన్న వారిలో 114 మంది వ్యతిరేకించగా 18 మంది అనుకూలంగా ఓటు వేశారు. జనసేన నాయకులు మాత్రం పంచాయతీ రెండుగా విభజించాలనే వాదన వినిపించగా, టిడిపి నాయకులు కొందరు, వైసిపి నాయకులు, సాధారణ ప్రజ లు విభజనకు వ్యతిరేకంగా ఓటు వేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి యేసు చేతులు పైకె త్తించే విధానంలో వోటింగ్ పద్ధతి సాగించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కో ఆప్షన్ సభ్యులు బళ్ళ నోబుల్ ప్రభాకర్, మాజీ సర్పంచ్లు జంపన రామకృష్ణంరాజు, రావి ధర్మరావు, నీటి సంఘం అధ్యక్షులు నామన నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆర్ఐ పికెడి.ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నిడదవోలులో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా సేవలందించి, ఉదోన్నతిపై ఉండ్రాజవరం మండల ఆర్ఐగా బుధవారం బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. తమ సిబ్బంది అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు.

బాణసంచా విక్రేతలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

దీపావళి బాణాసంచా విక్రయించే దుకాణాల వద్ద ప్రమాదాల నివారణకు దుకాణదారులు ముందస్తుగా అన్ని జాగ్రత్తలూ పాటించాలని తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. గురువారం మండల కేంద్రం ఉండ్రాజవరంలో అనుమతి పొందిన బాణసంచా దుకాణదారులు దుకాణాలు ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. చిన్న పొరపాటుకు పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది కనుక ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. దుకాణదారులు తప్పనిసరిగా అన్ని జాగ్రత్తలూ పాటించాలన్నారు. ముందస్తు జాగ్రత్తగా ఇసుక, బకెట్లలో నీరు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణాల వద్ద అగరబత్తులు ముట్టించవద్దన్నారు. కొనుగోలుదారులు, ప్రజలు, ఎవరైనా దుకాణాల వద్ద సిగరెట్లు తాగకుండా చూసుకోవాలన్నారు. ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎఇ రమేష్‌బాబు, నిడదవోలు ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ సిహెచ్‌బివిఎస్.రాజు, విఆర్‌ఒ పాపారావు, దుకాణదారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డిఒ పి.శ్రీకర్

పెండింగ్ కేసులపై నివేదిక ఇవ్వాలి

ప్రజాశక్తి - కొత్తపేట

పెండింగ్ కేసులపై త్వరితగతిన తదుపరి చర్య, నివేదికలు వెంటనే పంపవలసినదిగా ఎస్‌సి, ఎస్‌టి మోనిటరింగ్ కమిటీ ఛైర్మన్ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీకర్‌కోరారు. వారి సమక్షంలో ఎస్‌సి, ఎస్‌టి మోనిటరింగ్ కమిటీ సమావేశం గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేశారు. సమావేశానికి డిఎస్‌పి యస్.మురళీమోహన్, కమిటీ సభ్యులు అం దరూ హాజరయ్యారు. ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే సదరు విషయాలను కమిటీ దృష్టికి తీసుకోనిరావాలని కమిటీ సభ్యులను కోరారు. ప్రతి 3 నెలలకొకసారి నిర్వహించే ఈ సమావేశానికి ముందస్తుగా సమస్యలను/సలహాలను, సూచనలు పంపించాలన్నారు. సమస్యలపై తీసు కొన్న చర్యలను తెలియజేసే నివేదికలు సమర్పించాలన్నారు. సమావేశంలో కొత్తపేట డివిజన్ లోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎఎస్‌డబ్ల్యూఒ కొత్తపేట, రెవెన్యూచ పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొండవరం గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ చట్టం పనులను ఎంపిడిఒ లక్ష్మీ రెడ్డి గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ చట్టంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.


కరపత్రాన్ని విడుదల చేసిన జెఎసి

ఆలమూరు విలీనంపై జెఏసి కార్యాచరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలో కలపాలనే డిమాండ్‌పై జెఏసి ఏర్పాటైన విషయం విదితమే. ఈ మేరకు గురువారం జెఎసి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సమత కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో కార్యాచరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజలు, ఉద్యోగులు అందరూ ముక్తకంఠంతో ఆలమూరు మండలాన్ని రాజమహేంద్రవరంలో కలపాలని కోరుకుంటున్నారన్నారు. మన పక్క నియోజకవర్గమైన మండపేటను కోనసీమ నుంచి వేరుచేసి రాజమహేంద్రవరంలో కలపాలని అక్కడ ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రభుత్వం దృష్టికి, జిల్లాల విభజన కమిటీ దష్టికి తీసుకెళ్లామన్నారు. మన ఆలమూరు మండల జెఏసి నాయకుల ఆధ్వర్యంలో మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నేతలు, ప్రజలందరూ కలసి ప్రస్తుత మన శాసనసభ్యులైనటువంటి బండారు సత్యా నంద రావు దష్టికి మన ఆవేదనను మన మండలం నుంచి అమలాపురం వెళ్లడానికి, పడే ఇబ్బందులను తీసుకువెళ్లి మన మండలాన్ని రాజమహేంద్రవరంలో కలిపేలా ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్ల వలసిం దిగా ఎంఎల్‌ఎను జెఏసి కోరేందుకు తీర్మానించారు. ఈ నెల 27న ఈ కరపత్రాలతో పాటు స్థానిక తహ శీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ లకు వినతి పత్రాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు నాతి కుమార్ రాజా, కొండే రామకష్ణ, కొపనాతి శ్రీనివాసరావు, తాడి మధుసూదన్ రెడ్డి, యాళ్ల రవిరాజ్, కట్ట సత్య ప్రసాద్, మిద్దె పురుషోత్తం, తాడి రామకృష్ణారెడ్డి, శరబందు రాజు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

విశాఖలో గూగుల్ సంస్థ రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ అన్నారు. గురువారం పట్టణంలో గూగుల్ రాకపై టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినందుకు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, మాజీ జడ్‌పిటిసి మడికి ప్రసాద్, టిడిపి నాయకులు గుళ్ళ సుబ్బారావు, పాల్గొన్నారు.


రతీదేవిని సన్మానిస్తున్న ఛైర్మన్ తదితరులు

ఎంఎంసి వైస్ ఛైర్మన్ రతీదేవికి ఘన సన్మానం

ప్రజాశక్తి-నిడదవోలు

నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా నియమితులైన నిడదవోలు మున్సిపల్ కౌన్సిలర్ పువ్వుల రతీదేవిని గురువారం పురపాలక సంఘం కార్యాలయంలో ఛైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 20 ఏళ్ల సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ కౌన్సిలర్‌ను అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా ఎంపిక చేయడం హర్షణీయం అన్నారు. మున్సిపల్ కమిషనర్ తోట శ్రీకృష్ణవేణి, కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది, రతి దేవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఈ శాఖకు, ఈ పదవికి మరింత వన్నె తెచ్చే విధంగా కృషి చేస్తానని, నిడదవోలులో వ్యవసాయ మార్కెట్ యార్డ్ నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్, సింగవరం సొసైటీ ప్రెసిడెంట్ పెన్మత్స చందు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై శిక్షణ

ప్రజాశక్తి - కరప

గురజనాపల్లి ప్రభు త్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యా యులకు సిపిఆర్‌పై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హెచ్ఎం సాయిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావుకు డాక్టర్ శ్రీకాంత్ నివాళి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

చల్లపల్లి పంచాయతీ జగ్గరాజు పేటకు చెందిన వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్ తండ్రి లక్ష్మణరావు(70) అమలాపురం ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురు వారం మృతి చెందారు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


లక్ష్మణరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న శ్రీకాంత్

లక్ష్మణరావు భౌతిక కాయానికి వైసిపి అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


పాతకోట వంతెన ఇదే

శిథిలావస్థకు పాతకోట వంతెన

- శంకుస్థాపన చేసి ఆరేళ్లు
- వంతెన పూర్తయ్యేది ఎప్పటికో?

ప్రజాశక్తి - రామచంద్రపురం

బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుని పాతకోట గ్రామ ప్రజలను ప్రయా ణికులను భయాందోళనలకు గురిచేస్తుంది. కె.గంగవరం మండలంలోని పాతకోట గ్రామానికి నిర్మించిన వంతెన కూలడానికి సిద్ధంగా ఉంది. పాతకోట గ్రామ ప్రజలు కోటిపల్లి ద్రాక్షారామ చేరుకునేందుకు ప్రధాన రహదారి ఈ వంతెన పైనుండే ఉంది. సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో 2019లో అప్పటి ఎంఎల్‌ఎ తోట త్రిమూర్తులు ఈ వంతెన నిర్మాణానికి నిధులు మం జూరు చేయించారు. రూ.17 లక్షలతో దీనికి శంకుస్థాపన చేశారు. ఆరేళ్లు గడిచి పోయినా పనులు మొదలు కాలేదు. తర్వాత ప్రభుత్వం మారడంతో దీనిని పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. వైసిపి ప్రభుత్వం తర్వాత గత ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం ఈ వంతెన నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించాలని లేని పక్షంలో పాతకోట ప్రజలకు మొన్న ఏకైక మార్గం ఈ వంతెన కూలిపోతే ఇక్కట్లకు గురి కావాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వెంటనే ఇరిగేషన్ జల వనరుల శాఖ అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని పునఃప్రారంభించాలని పాతకోట గ్రామ ప్రజలు, ప్రయాణికులు అధికారులను ప్రజాప్రతినిధులను కోరు తున్నారు. ఈ వేసవిలో ఈ పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


2019లో వేసిన శిలాఫలకం